హనుమాన్ జయంతికి భారీ భద్రత

- నేటి శోభాయాత్రకు పటిష్ఠ బందోబస్తు
- రౌడీషీటర్ల కదలికలపై నిఘా
- రంగంలోకి అదనపు బలగాలు
- సీసీ కెమెరాలతో ర్యాలీల పర్యవేక్షణ, వీడియో చిత్రీకరణ



హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర (ఫైల్)

బంజారాహిల్స్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 'జై బోలో హనుమాన్‌కి, జైశ్రీ రాం' అంటూ భక్తుల ఆధ్యాత్మిక నినాదాలు, యువత ఉత్సాహంతో శనివారం నిర్వహించే హనుమాన్ జయంతికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించే శోభాయాత్రలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా పికెటింగ్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పశ్చిమ మండలం పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన అధికారులు ఆయా ప్రాంతాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అదనపు బలగాలతో...

పశ్చిమ మండలం పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఫిలింనగర్, సంజీవరెడ్డినగర్, మధురానగర్, బోరబండ, మాసబ్‌ట్యాంక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇప్పటికే ర్యాలీలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు నిర్వహిస్తారనే దానిపై పోలీసులకు స్పష్టత వచ్చింది. కొన్ని ర్యాలీలు ఉత్సవాలు జరిగే ఆలయాల పరిధిలోనే జరుగుతుండగా, మరికొన్ని ప్రధాన ర్యాలీల్లో కలుస్తుండటంతో అందుకు అనుగుణంగా అదనపు బలగాలను రంగంలోకి దించారు. సుమారు రెండు వేల మందికి పైగా అదనపు సిబ్బందిని హనుమాన్ శోభాయాత్ర బందోబస్తుకు ఉపయోగించనున్నారు. ఆలయాల వద్ద కూడా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఆలయాలకు వచ్చే మహిళా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా మహిళా సిబ్బందిని వినియోగిస్తున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

పోలీసు స్టేషన్ల వారీగా ఇప్పటికే రౌడీషీటర్లను పిలిచి పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ వారి కదలికలపై ఓ కన్నేసి ఉంచాలని సిబ్బందికి ఉన్నతాధికారులు సూచించారు. జారీ చేశారు. గత మూడేళ్లుగా జరిగిన ర్యాలీల్లో చిన్నపాటి గొడవలు జరిగిన నేపథ్యంలో రౌడీషీటర్లను ముందస్తు బైండోవర్‌కు చర్యలు చేపట్టారు. క్రియాశీలకంగా ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యే దృష్టి సారించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొని బైండోవర్ చేస్తున్నారు. శాంతిభద్రతల విభాగమే కాకుండా ఎస్‌బీ సిబ్బంది కూడా అనుమానస్పద వ్యక్తులపై మఫ్టీలో నిఘా పెట్టింది.

వీటిని పాటించాలి

హనుమాన్ జయంతి నేపథ్యంలో పోలీసులు పలు సూచనలు జారీ చేశారు

- ఇతరులను దూషిస్తున్నట్టు నినాదాలు చేయొద్దు
- జెండాలు తప్పితే కర్రలు, ఇతర ఆయుధాలు పట్టుకోవద్దు
- ఇతరులకు ఇబ్బంది కలిగించేలా లౌడ్ స్పీకర్లు వాడరాదు.
- శోభాయాత్ర సందర్భంగా బంతిపూలు వంటివి రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులపై విసరరాదు
- ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి.

పోలీసులకు అందరూ సహకరించాలి

బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో హనుమాన్ జయంతి సందర్భంగా ర్యాలీలు నిర్వహించే యువత పోలీసుల నిబంధనలను, ఆదేశాలను కచ్చితంగా పాటించాలి. ర్యాలీకి అవాంతరాలు ఏర్పడకుండా ముందస్తుగా సీసీ కెమెరాలను అందుబాటులో ఉంచాం. ప్రతి ర్యాలీని వీడియో కెమెరాతో చిత్రీకరిస్తాం. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, గొడవలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తాం. ర్యాలీలు చేసేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. సమస్యాత్మకప్రాంతాల్లో పికెట్లను ఏర్పాటు చేశాం.

- సామల వెంకట్‌రెడ్డి, బంజారాహిల్స్ ఏసీపీ

పోలీసుస్టేషన్ల వారీగా రౌడీషీటర్లు

బంజారాహిల్స్	28
జూబ్లీహిల్స్	07
ఫిలింనగర్	07
మాసబ్‌ట్యాంక్	07
పంజాగుట్ట	03
మధురానగర్	24
సంజీవరెడ్డినగర్	13
బోరబండ	72

శోభాయాత్ర నేపథ్యంలో..



పశ్చిమ మండలం పరిధిలో సుమారు వంద వరకు హనుమాన్ శోభాయాత్ర ర్యాలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇందులో కొన్ని సుల్తాన్ బజార్ వరకు వెళ్లి అక్కడ ప్రధాన శోభాయాత్రలో కలుస్తాయి. మిగతా ర్యాలీలు బస్తీలకే పరిమితమవుతాయి. ఈ ర్యాలీ నిర్వాహకులకు పోలీసులు పలు నిబంధనలు జారీ చేశారు.

ఫోక్సో కేసులో నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్ష

- రూ. 5 లక్షల పరిహారం



నిందితుడు శ్రీనివాస్

ఖైరతాబాద్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి కోర్టు 25 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023వ సంవత్సరంలో దళిత వర్గానికి చెందిన ఓ బాలిక పట్ల అసభ్యం గా వ్యవహరించిన కేసులో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీతో పాటు ఫోక్సో కేసులు నమోదైంది. ఇందులో సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్ విచారణ జరిపి కోర్టుకు నివేదించగా నాంపల్లి కోర్టు 12వ అదనపు సెషన్స్ జడ్జి అనిత కేసును విచారించి నిందితుడికి 25 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. దీంతో పాటు బాధిత బాలికకు 5 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఇవ్వాలని ఆదేశించారు.

వైభవంగా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

బంజారాహిల్స్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లోని కమాన్ మిథులానగర్ రోడ్డులోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం శ్రీభవానీ(పార్వతి) అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. పుష్పాదివాసం, జలాదివాసం, క్షీరాబ్దివాసం తదితర కైంకర్యాలను వేదపండితులు నిర్వహించారు. అనంతరం నవగ్రహ, వాస్తు, ఆదిత్య, గణపతి, ఈశ్వర హోమ పూజలు చేశారు. అమ్మవారి మొదటి చూపును కామధేనువుతో ప్రారంభించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం శివపార్వతుల కల్యాణం, కుంకుమార్చన చేశారు. విజయవాడ శృంగేరి పీఠం ధర్మాధికారి డీవీఎస్ చలపతిరావు నేతృత్వంలో జరిగిన ఈ పూజల్లో ఆలయ అధ్యక్షుడు పి. వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

'పూలే సినిమా విడుదలను అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నాం'



సమావేశంలో పాల్గొన్న ప్రొ. కంచ ఐలయ్య షెఫర్డ్, కొల్లూరి భరత్

పంజాగుట్ట, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): సంఘసంస్కర్తలు మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవితాలపై హిందీలో తీసిన చరిత్రాత్మక చిత్రం పూలే సినిమా విడుదలను కేంద్ర సెన్సార్ బోర్డు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెఫర్డ్ అన్నారు. ఎలాంటి మార్పులు లేకుండా మొదట అనుమతి పొందిన విధంగానే సినిమాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహాల ఏర్పాటు కమిటీ ప్రతినిధి కొల్లూరి భరత్, తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అయితే, మహారాష్ట్రకు చెందిన బ్రాహ్మణ సంఘం ఫెడరేషన్ అధ్యక్షుడు అనంద్ దావే సినిమాలో అభ్యంతర సన్నివేశాలు, మాటలు ఉన్నాయని వాటిని తొలగించాలని కేంద్ర సెన్సార్ బోర్డుకు ఫిర్యాదు చేయడంతో 11న విడుదల కావాల్సిన పూలే సినిమా నిలిచిపోయిందన్నారు. బ్రాహ్మణ సంఘాలు చెప్పినట్లుగా కొన్ని సన్నివేశాలు, మాటలు తీసివేసి ఈ నెల 25న సినిమా విడుదలకు అనుమతి ఇవ్వడం అంటే మహనీయులను అవమానించినట్లేనని అన్నారు.

'ప్రజావాణి'కి 294 దరఖాస్తులు

బేగంపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 294 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డా. చిన్నారెడ్డి, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని దరఖాస్తు దారులకు భరోసా ఇచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 50, విద్యుత్‌కు 31, రెవెన్యూకు 43, హోం శాఖకు 14, ప్రవాసీ ప్రజావాణికి ఒకటి , ఇందిరమ్మ ఇళ్ల కోసం 91, ఇతర శాఖలకు 65 దరఖాస్తులు అందినట్లు అధికారి తెలిపారు.

గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలి: సీపీఎం

బోరబండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ధరల పెంపును నిరసిస్తూ రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ రెండుబొమ్మల కూడలిలో సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. నాయకులు టి.సాయి శేషగిరిరావు, జాకటి స్వామి మాట్లాడుతూ, బడా పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్లు మాఫీ చేస్తూ అంతే మొత్తంలో సబ్సిడీలు అందజేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపడం అన్యాయమన్నారు. పెంచిన గ్యాస్ ధరల ప్రభావం తెలంగాణలోని 91 లక్షల కుటుంబాలపై పడుతోందన్నారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- సర్పంచ్‌ల సంఘం జేఏసీ

బేగంపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో డా. చిన్నారెడ్డి, దివ్యలను కలిసి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. గత సంవత్సర కాలంగా పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా బిల్లులు రాలేదని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజాభవన్ నుంచి అర్ధనగ్నంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారిని పోలీసులు అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే అరెస్టు చేయడం దారుణ మన్నారు. బిల్లులు రాక ఇప్పటికే చాలా మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన సర్పంచ్‌ల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కేశ బోయిన మల్లమ్మ, జేఏసీ నాయకులు బొడ్డు నర్సింహులు, రవీందర్, దుర్గం నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డా.బీఆర్ అంబేడ్కర్

- మహిళా సదస్సులో ప్రొ.చల్లపల్లి స్వరూపారాణి



సదస్సులో పాల్గొన్న ప్రొ. స్వరూపారాణి, వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సామాజిక సాధికారత ఉత్సవంలో భాగంగా"డా.బీఆర్ అంబేడ్కర్ - బహుముఖ ప్రజ్ఞాశాలి" అనే అంశంపై శుక్రవారం వర్సిటీలో మహిళా సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చరిత్ర విభాగ ఆచార్యులు స్వరూపా రాణి మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలోనూ అణగారిన కులాలను దూరంగా పెట్టారని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం అణగారిన కులాలను దేశ ద్రోహులుగా ముద్రించి, పాలేర్లుగా మార్చుకున్నారన్నారు. కుల రహిత సమాజానికి వివిధ ప్రాంతాల్లో అనేక మంది సంఘ సంస్కర్తలు కృషి చేశారన్నారు. సామాజిక సమానత్వమే అసలైన స్వతంత్రమని అంబేడ్కర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి విశ్రాంత అదనపు కార్యదర్శి రచయిత జూపాక సుభద్ర "అంబేడ్కర్-హిందూ కోడ్" అనే అంశంపై ప్రసంగించారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గడ్డం, ప్రజాస్వామిక రచయితల వేదిక కార్యదర్శి డా.కే.ఎన్. మల్లేశ్వరి, కేంద్రసాహిత్య యువ పురస్కార అవార్డు గ్రహీత ఎండ్లూరి మానస, రచయిత్రి జాజుల గౌరీ సదస్సులో మాట్లాడారు. విశ్వవిద్యాలయ కళల విభాగ డీన్ ప్రొ.కె. రాణి రజిత మాధురి, సికా డైరెక్టర్ ప్రొ.శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

సాహిత్య సమ్మేళనం

డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సామాజిక సాధికారత ఉత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం జ్ఞాన వనంలో సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి, విశిష్ఠ అతిథిగా ఆచార్య పిల్లల మర్రి రాములు, గౌరవ అతిథిగా ప్రొ.జి.పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్వీకే రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. సభాధ్యక్షురాలుగా తెలుగుశాఖ ఆచార్యులు ఎన్ రజిని వ్యవహరించారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



బోరబండలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఎండీ బాబాఫసియుద్దీన్ తదితరులు



పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి

ఘనంగా పూలే జయంతి వేడుకలు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రపజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటాలకు, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహాత్మాజ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త, విద్యావేత్త అని, బడుగుల జీవితాలలో వెలుగులు నింపడానికి, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప యోధుడని వారు కొనియాడారు. జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, నేటి యువత ఆయన బాటలోనే నడవాలని అన్నారు.

(ఆంధ్రజ్యోతి,ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ జోన్ల బృందం)

అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి



మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నాయకులు

ఖైరతాబాద్,ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం మింట్ కాంపౌండ్ విద్యుత్ బీసీ భవన్ ముందున్న మహాత్మా జ్యోతిరావు, సావిత్రీబాయి పూలేల విగ్రహాల వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తమ పోరాటం వల్లే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును అసెంబ్లీ ఆమోదించిందన్నారు. రిజర్వేషన్లు అమలు పరిచేవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, కంటోన్మెంట్ నాయకుడు గజ్జెల నగేష్, యూపీఎఫ్ కో కన్వీనర్ శివ, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీనచారి, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ పసన్న రామ్మూర్తి, తెలంగాణ జాగృతి నేత తేజ తదితరులు పాల్గొన్నారు.



ఫిలింనగర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, నగేష్‌సాగర్



గౌరీశంకర్ కాలనీలో వేడుకల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర నాయకుడు బాలాజీ గోస్వామి



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ గ్రంథాలయ వేదిక వద్ద పూలేకు నివాళులర్పిస్తున్న బీసీ కార్పొరేషన్ చైర్మన్ నిరంజన్

పూలే స్ఫూర్తి కాంగ్రెస్‌కు ఆదర్శం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే స్ఫూర్తిని కాంగ్రెస్ పార్టీ ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి విగ్రహాలను ఆయన మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పూలే ఉత్సవాల కమిటీ చైర్మన్ వి.చిన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, అగ్రకులాల కుట్రలతో మహాత్మా జ్యోతిరావు పూలే మరుగున పడిపోయారని, ఏ సాంకేతికత లేని రోజుల్లో ఆయన తీసుకున్న చర్యలు స్ఫూర్తిదాయకమైన సందేశాన్నిస్తాయన్నారు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పూలేకు దండం పెట్టని ఏకైక నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ అని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్,బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు రాంచంద్రయాదవ్ కార్య క్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, డాక్టర్ రత్నకుమార్, వెంకటేశ్ చౌహాన్, బీసీ సంఘాల నేతలు మణిమంజరి, కుందారపు గణేష్చారి. విక్రమ్, శ్యాం. తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల నేతలతో కార్పొరేటర్ వాగ్వాదం..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ నిరసన తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సభ నుంచి వెళ్లాక బీసీ సంఘాల నేతలతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు కార్పొరేటర్‌ను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. అనంతరం జాజుల శ్రీనివాస్ పై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, బీఆర్ఎస్, జాగృతి కార్యకర్తలతో కలిసి ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

ఖైరతాబాద్,ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఖైరతాబాద్ నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలో ఏర్పాటు చేస్తుండటంపై ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహాత్మా పూలే విగ్రహాన్ని తమ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్‌వ్యూ పార్కులో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుకర్ యాదవ్, మహేందర్‌బాబు, చందు గంగపుత్ర, సురేందర్ ముదిరాజ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్.. పోలీసుల అదుపులో నిందితుడు

బోరబండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న యువకుడిని బోరబండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపి న ప్రకారం. విజేత థియేటర్ ఎదురుగా ఉన్న టీ స్టాల్ లో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి నూర్‌ఖాన్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనున్న నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు ఎస్ఐ బి.మనోజ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ చోరీకి విఫల యత్నం

బంజారాహిల్స్,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేవాలయంలో హుండీ చోరీ చేసేందుకు ప్రయత్నించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 లోని నందినగర్‌లో బస్టాప్ సమీపంలో ఉన్న ఆలయంలో ఈనెల 10వ తేదీ అర్ధరాత్రి తర్వాత శబ్దాలు వచ్చాయి. ఆ పక్కనే హోటల్ నిర్వహించే మేకల అనిల్ కుమార్ మేల్కొని చూడగా ఎండీ రెహ్మాన్ అనే యువకుడు హుండీ తెరిచేందుకు ప్రయత్నిస్తూ కనిపించాడు. వెంటనే అతను స్థానికులను పిలిచి ఆ రెహ్మాన్‌ను పట్టుకొని బంజారాహిల్స్ పోలీసులు అప్పగించారు. కాగా, నిందితుడు పుట్టుకతో మూగ చెవుడు సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నడిరోడ్డుపై యువతి చేయి పట్టుకొని వేధింపులు

- నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నడిరోడ్డు పై ఓ యువతి చేయి పట్టుకొని వేధించిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన యువతి ఓ సంస్థలో జూనియర్ రీసెర్చ్ ఆఫీసర్ గా పని చేస్తోంది. కొద్దిరోజులుగా బి.క్రాంతి కుమార్ అనే వ్యక్తి ఆమెను మానసికంగా వేధిస్తున్నాడు. ఈనెల 10వ తేదీన ఆమె విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా రోడ్డుపై అడ్డుకొని చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 78, 351(2),351(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో యువతిని నిర్బంధించి లైంగిక దాడి

బంజారాహిల్స్,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి యువతిని రెండు రోజుల పాటు నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదైంది. నగరానికి చెందిన ఓ యువతి శ్రీనగర్ కాలనీలోని ఓ సౌండ్ లాబ్స్ లో పని చేస్తోంది. 2024 అక్టోబర్‌లో శేషు మోహన్ తురగా తో పరిచయం ఏర్పడింది. కొద్ది రోజుల పాటు ఇద్దరూ స్నేహంగా ఉన్నారు. అనంతరం శేషు ప్రేమిస్తున్నట్టు చెప్పాడు. మొదట యువతి నిరాకరించింది. చివరకు ఇద్దరూ ప్రేమలోపడ్డారు. పెళ్లి చేసుకుందామని ప్రతిపాదించుకున్నారు. ఇదే విషయాన్ని ఇద్దరూ తమ కుటుంబ సభ్యులకు చెప్పారు. శేషు తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. యువతి ఇంట్లో తల్లి, అమ్మమ్మ ఒప్పుకోగా, తండ్రి మాత్రం విభేదించాడు. ఇంటి నుంచి యువతిని బయటకు పంపించేశాడు. దీంతో ఆమె శేషుకు ఫోన్ చేసి తనను తీసుకువెళ్లాలని కోరింది. ఈ నెల 4న యువతిని స్టూడియోకు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెను ఓ గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడే నిర్బంధించి మానసికంగా, శారీరకంగా హింసించాడు. జాతకాలు కలవడం లేదని పెళ్లి చేసుకోనని చెప్పాడు. ఆమె బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. అతను లేని సమయంలో యువతి డయల్ 100 ఫోన్ చేసి పోలీసుల సహాయంతో బయటకు వచ్చింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు శేషుపై బి ఎం ఎస్ 69 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో బంగారు గొలుసు చోరీ

పంజాగుట్ట, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం నుంచి పంజాగుట్ట వరకు బస్సులో ప్రయాణించిన ఓ వ్యక్తి మెడలో నుంచి 26 గ్రాముల బంగారు గొలుసును అగంతకులు దొంగిలించారు. గురువారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ టీఎన్జీఓ కాలనీకి చెందిన శ్రీధర్ పంజాగుట్టకు వెళ్లడానికి మెహిదీపట్నంలో సిటీ బస్సు ఎక్కాడు. పంజాగుట్ట బస్టాప్‌లో బస్సు దిగి చూసుకోగా మెడలోని బంగారు గొలుసు కనిపించలేదు. బస్సు దిగేటప్పుడు ముగ్గురు వ్యక్తులు మెట్ల వద్ద ఉండి అటూ ఇటూ నెట్టివేశారని, ఒక వ్యక్తి తనను కిందకు నెట్టడానికి ప్రయత్నిస్తూ తన మెడలో నుంచి గొలుసు దొంగలించారని పంజాగుట్ట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అన్నాడు.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సర్వీస్ క్యాంప్



హస్మత్‌పేటలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సర్వీస్ క్యాంప్‌లో అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంలో ఎప్పుడూ ముందుంటామని బీఎస్ఎన్ఎల్ నార్త్ డీజీఎం ఎం.నర్సింహులు పేర్కొన్నారు. హస్మత్‌పేట టెలిఫోన్‌ఎక్స్ఛేంజ్ ప్రాంగణంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సర్వీస్ క్యాంప్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోన్‌బిల్లులకు సంబంధించిన సమస్యలు, కొత్త ప్లాన్లకు సంబంధించిన వివరాలు వినియోగదారులకు వివరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏజీఎం ఎస్.మురళీ కృష్ణ, టెలికం మేనేజర్ జాహ్నవి, ఏజీఎం ఎన్.గోపాల్ రెడ్డి, అధికారులు రమేష్, శంకర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఐ కృత్రిమ మేధతో కంప్యూటర్ విద్య



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో రోహిణి, ఉపాధ్యాయులు

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏఐ కృత్రిమ మేధతో కూడిన కంప్యూటర్ విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని హైద్రాబాద్ జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో చిలకలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇంగ్లిష్ మీడియం బ్రోచర్‌ను అవిష్కరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా అన్ని పాఠశాలలో సౌకర్యాలు కల్పించి, ఉచితంగా నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ డీఈఓ శ్రీధర్, ఐఏఎస్ మదన్ మోహన్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి, హెచ్‌ఎం మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయులు సాలెహా, షహీన్ సుల్తానా, పుష్పలత, ఉమా, గీత ఓపెన్, కో ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుల సాధనకు రేపు రౌండ్ టేబుల్ సమావేశం

- దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్



తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

తార్నాక, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుల సాధనకై ఈనెల 13న హైద్రాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్ కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం తార్నాకలోని దక్షిణాది జేఏసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అసైన్డ్ పట్టా ఇళ్లకు యాజమాన్య హక్కులు లేకపోవడంతో ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా కూల్చివేతలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో అసైన్డ్ పట్టా ఇళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు, యాజమాన్య హక్కులను కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్, దక్షిణాది జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని తలపెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ పరిధిలో నివసిస్తున్న అన్ని బస్తీల ప్రజలు పెద్ద ఎత్తున్న హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గాంధీ మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే



గాంధీ మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కాలేజీలోని 2019 బ్యాచ్‌కు చెందిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం వైభవంగా జరిగింది. ముఖ్యఅతిదిగా కాలోజీ నారాయణ హెల్త్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ పీవీ నంద కుమార్ పాల్గొన్నారు. పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు మెడల్స్ ఎంబీబీఎస్ పూర్తి చేసిన బ్యాచ్ వైద్య విద్యార్థులకి అందజేశారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర, గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, వివిధ విభాగాల హెచ్ఓడీలు వాల్య, రాజారావు, మురళిధర్, గాంధీ అలుమిని అసోసియోషన్ అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తిరుమలగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం 7వ వార్డు పరిధిలోని సెంట్రల్ బట్టిలో ఉచిత వైద్య శిబిరాన్ని కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో పలువురికి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏడవ వార్డు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల రుక్మయ్య, చిన్నన్న, ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రాజా రెడ్డి, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు ఉమేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప జన్మదిన వేడుకలు



మెట్టుగూడ అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

చిలకలగూడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జన్మనక్షత్రం ఉత్తర ఫల్గుణి సందర్భంగా స్వామివారి జన్మదిన వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో మెట్టుగూడ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 900మందికి అన్నదాన ప్రసాద వితరణ గావించారు. నగరంలోని పలువురు మళయాళీయులు తరలి వచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కేపీ రవీంద్రన్, కార్యదర్శి కేపీసీ నాయర్, కోశాధికారి గంగాధరన్ పాల్గొన్నారు.

బొల్లారం అయ్యప్ప ఆలయంలో ..

తిరుమలగిరి: బొల్లారం అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 108 మంది మహిళా భక్తులు కలశ పూజలు నిర్వహించారు. అనంతరం 2 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమం కమిటీ సభ్యులు అధ్యక్షుడు వేళాయిదాన్, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవి నాయర్, సభ్యులు విక్రమ్ పిల్లాయ్, సుధాకరణ్, వినీత్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా డివిజన్లలో ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాజ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త, విద్యావేత్త అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు.

- సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి)



బోయినపల్లి చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బీసీ ఐక్యవేదిక ప్రెసిడెంట్ శ్రీనివాస్, బీసీ సంఘాల నాయకులు



లాలాపేట్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి, తదితరులు



అడ్డగుట్ట సీపీఎం కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించిన సీపీఎం నాయకులు అంజయ్‌బాబు, శారద, శ్రీనివాస్, ఫాతిమా, వనిత



సికింద్రాబాద్ సివిల్ కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన జ్యోతి రావు పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, తదితరులు



దూద్‌బావిలో పూలే చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్, ఆదర్శ్ ముదిరాజ్, తదితరులు



ఓల్డ్ గ్యాస్మండిలో ఆదయ్య మెమోరియల్ స్కూల్ ఆవరణలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాంగోపాల్ పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయ, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, తదితరులు



లాలాపేట్ చౌరాస్తాలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, తదితరులు



పార్సీగుట్టలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాదిగ సోషలిస్ట్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్

కంటోన్మెంట్‌లో పూలే కాంస్య విగ్రహం ఏర్పాటుకు విరాళాలు



బోయినపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే నివాళులర్పిస్తున్న బానుక నర్మద మల్లికార్జున్, జక్కుల మహేశ్వర్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు

బోయినపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి అంకురార్పణ చేసినట్లు, ఇందుకోసం పార్టీలకు అతీతంగా నాయకులు నిధులు అందించడం శుభపరిణామమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ పేర్కొన్నారు. శుక్రవారం బోయినపల్లి చౌరస్తా వద్ద యనమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటంవద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ నాయకుల కోరిక మేరకు మహాత్మా జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహం ఏర్పాటుకు బానుక నర్మద మల్లికార్జున్ రూ. లక్ష, బీఎన్ శ్రీనివాస్ రూ. 50వేలు, బీఆర్ఎస్ పార్టీ నుంచి బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్ రూ.50 వేలు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి రూ.50 వేలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ రూ. 25 వేలు విరాళాలను ప్రకటించారు. వచ్చే సంవత్సరం పూలే జయంతి రోజున కాంస్య విగ్రహంతో వేడుకలు జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, బద్దం బల్వంత్ రెడ్డి, సదా, మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్ బాబు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో బీజేపీ 'స్వచ్ఛభారత్'



బౌద్ధనగర్‌లో రోడ్లును శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా శుక్రవారం బౌద్ధనగర్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బీజేపీ నాయకురాలు మేకల కీర్తి, నాయకులు హన్మంత్ ముదిరాజ్, కొమరయ్య, సత్యనారాయణ తదితరులు సంజయ్‌గాంధీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా రోడ్లును ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛభారత్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, అశోక్, నాగరాణి, మమత పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనుల పరిశీలన

అడ్డగుట్ట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లోని ఏ.సీ సెక్షన్‌లలో జరుగుతున్న నాలా పూడికతీత పనులను శుక్రవారం అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పరిశీలించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు సహకారంతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, దేవయ్య, ఇస్మాయిల్, రామప్పలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల 'బస్తీబాట'



సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి, ఇందిరానగర్‌కాలనీలో శుక్రవారం బీజేపీ నాయకులు బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, మాజీ డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, కనకట్ల హరి, ప్రభుగుప్తా పాల్గొన్నారు.

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)

'కలుషితనీటి సమస్యను పరిష్కరించాలి'

పద్మారావునగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ సికిందరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ టీ.రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని గొల్లకొమురయ్య కాలనీలోని ప్రజలు కలుషిత తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకొన్న బీజేపీ నాయకులు, శుక్రవారం కాలనీని సందర్శించారు. అనంతరం బోయగూడ జలమండలి అధికారి షేక్ సలీంను కలిసి సమస్యను వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేఎం కృష్ణ, సత్యనారాయణ, వైసురేశ్, అంగముత్తు శ్రీనివాస్, వైశ్రీనివాస్, శీలం శివలింగం, రామంచ మహేశ్ పాల్గొన్నారు.

బోయినపల్లి మార్కెట్ యార్డులో సద్దుమణిగిన వివాదం



మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్‌ను కలిసిన కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి

బోయినపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వారంరోజులుగా బోయినపల్లి మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ యార్డు చైర్మన్ ఆనంద్‌బాబు, మార్కెట్ అధికారులకు, కమిషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమా దేవేందర్‌రెడ్డి మధ్య కొనసాగుతున్న వివాదం శుక్రవారం సద్దుమణిగింది. కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమా దేవేందర్ రెడ్డి, కారు పార్కింగ్ విషయంలో సెక్యూరిటీ గార్డుపై చేయి చేసుకోడంతో రగిలిన వివాదం తారాస్థాయికి చేరి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, ఫిర్యాదులు, ధర్నాలు చేసుకునే స్థాయికి వెళ్ళింది. దీంతో మార్కెట్ యార్డులో ఇరువర్గాల మధ్య కొద్దిగా మనస్పర్ధలు ఏర్పడ్డాయి. శుక్రవారం చైర్మన్ చాంబర్‌లో మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్ బాబు, అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ దేవేందర్ సుదీర్ఘంగా చర్చించుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా తామంతా డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఎంజీ రోడ్డు పాన్ బజార్‌లోని వార్డు కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో వేణు గోపాల స్వామి దేవస్థాన ధర్మకర్తలు బాబు గౌడ్, సదానంద్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

తిరుమలగిరి ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అరవింద్ శుక్రవారం బొల్లారంలో పాదయాత్ర చేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవి బాల్‌రాజ్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు రషీద్ ఉన్నారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు

పద్మారావునగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అధిక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం వల్ల నిరంతరం ఆరోగ్యంగా ఉండవచ్చని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని కృష్ణానగర్ కలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పోషణ్ పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారుల తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు తక్కువ ఖర్చుతో రాగులు, సజ్జలు, సామలు, జొన్నలు లాంటి ఆహార పదార్థాలు ఎలా తయారు చేసుకోవాలో వివరించారు.

అనంతరం మిల్లెట్స్‌తో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీచర్లు సావిత్రి, విజయరాణి, రూత, కుసుమ, అనిత, మంజుల, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో నగలు, నగదు చోరీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైలులో ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగులో ఉన్న నగలు, నగదు చోరీకి గురైంది. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాగర్నతం కుమారి ఈనెల 10న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. సికింద్రాబాద్‌లో బంధువుల ఇంటికి వస్తున్న ప్రయాణికురాలు తన బెర్తులో 25 తులాల బంగారు ఆభరణాలు, రూ. 50 వేలు నగదుతో కూడిన బ్యాగు తలకింద పెట్టుకుని నిద్రపోయింది. శుక్రవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రైలు కాసేపట్లో చేరుకుంటుందనగా నిద్ర లేచి చూడడంతో తన తలకింద పెట్టుకున్న బ్యాగు కనిపించలేదు. వెంటనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికురాలు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం చర్లపల్లి - ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో గుర్తుతెలియని(25) వ్యక్తి సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో సికింద్రాబాద్ వైపు వస్తున్న రైలు ఇంజన్ ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే రైలు ఇంజన్‌లో కో పైలెట్ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

700 మంది పోలీసులతో బందోబస్తు

- నేడు హనుమాన్ జయంతి
- తాడ్ బండ్ ఆలయం వద్ద వేడుకలకు సిద్ధం



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులకు, అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్

బోయినపల్లి/బౌద్ధనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ప్రశాంతంగా జరుపుకోవాలని నార్త్ జోన్ డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ సూచించారు. హనుమాన్ విజయోత్సవ ర్యాలీలో వాతావరణంలో జరిగేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ దేవాలయం ప్రాంగణం చుట్టుపక్కల సుమారు 700 మంది పోలీసులతో బోయినపల్లి పోలీసుల ఆధ్వర్యంలో డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా పెట్టి భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులకు సహకరిస్తూ పండుగను జరుపుకోవాలని డీసీపీ సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఏసీపీ గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇంపీరియల్ గార్డెన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది, అధికారులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డీసీపీ ఎస్.రష్మీపెరుమాళ్ వారికి దిశ నిర్దేశం చేశారు. ఈసందర్భంగా వారికి పలుసూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పోలీసుల అనుమతి లేకుండా డ్రోన్లు ఎగురవేయొద్దని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హనుమాన్ జయంతి వేడుకలకు తాడ్‌బండ్ ఆలయం సిద్ధంగా ఉందని ఆలయ ఈవో నరేందర్ తెలిపారు.

- హనుమజ్జయంతి వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టామని, నిఘా బృందాలను రంగంలోకి దింపామన్నారు.

వైభవంగా జీర్ణోద్ధరణ పూజలు



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శివాజీనగర్‌లోని వేంకటేశ్వర పెరుమాళ్ స్వామి ఆలయం 200 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా జీర్ణోద్ధరణ, అష్టబంధన మహా సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీన ప్రారంభమైన పూజా కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. తిరుమల తిరుపతి గోవింద రామానుజ చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈసందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పూజల్లో పాల్గొన్నారు. మహా కుంభాభిషేక పూజల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్పొరేటర్ కొంతం దీపిక, వివిధ ప్రాంతాల భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో సత్యమూర్తి, రినోవేషన్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.